
ప్రజాశక్తి
సోమవారం 3 నవంబర్ 2025 5 విజయనగరం



ప్రారంభమైన వరికోతలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో వల్లంపూడి రెవెన్యూ పరిధిలోని దబ్బిరాజుపేట చెరువు ఆయకట్టు పరిధిలో వరి కోతలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దీంతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. తుపాను కారణంగా చాలావరకు రైతులు వరికోతలను వాయిదా వేసుకున్నారు. మూడు రోజులుగా ఎండ కాస్తుండటంతో రైతులు వరి కోతలు ప్రారంభించారు.



వరిచేను కోస్తున్న రైతులు

అసౌకర్యాలతో అవస్థలు

- నాసిరకంగా నాడు-నేడు పనులు
- వర్షం కురిస్తే కారేస్తున్న భవనం
- కంపు కొడుతున్న మరుగుదొడ్లు
- పని చేయని ఆర్‌ఒ ప్లాంట్
- ఇదీ ఎస్‌సి బాలుర కళాశాల వసతిగృహం దుస్థితి

ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తున్నామనే పాలకుల మాటలు కోటలు దాటుతున్నా.. ఆచరణకు వచ్చే సరికి గడపదాటడం లేదు. అందుకు నిదర్శనమే ఎస్‌సి బాలుర వసతిగృహం. నాడు-నేడు కార్యక్రమంలో నాసిరకం పనులు చేపట్టడంతో భవనం వర్షం పడితే చాలు.. నీరుకారేస్తోంది. రక్షిత తాగునీటి సౌకర్యమూ లేదు. ఉన్న మరుగుదొడ్లు వినియోగించేందుకు పనికి రావడం లేదు. ప్రహరీ లేక ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయం వెంటాడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అవస్థల నడుమ విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు.

ప్రజాశక్తి-బొబ్బిలి



అధ్వానంగా ఉన్న హాస్టల్ ముందు భాగం

బొబ్బిలి గ్రోత్ సెంటర్ సమీపంలో ఉన్న ఎస్‌సి బాలుర కళాశాల వసతిగృహాన్ని బాగు చేసేందుకు గత వైసిపి ప్రభుత్వం నాడు - నేడు కార్యక్రమం ద్వారా రూ.25 లక్షలు నిధులు మంజూరు చేసింది. భవనం మరమ్మతులకు రూ.23 లక్షలు, విద్యుత్ వైరింగ్ పనుల కోసం రూ.2 లక్షలు కేటాయించారు. ఈ పనులు నాసిరకంగా చేయడంతో వర్షానికి స్లాబ్ లీకవుతోంది. నాడు - నేడు నిధులతో స్లాబ్ ఫ్లోరింగ్ పెట్టినా.. నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. కిచెన్ గది వర్షానికి కారుతున్నా అక్కడే భోజనాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చాలా చోట్ల స్లాబ్ లీకవుతుందని విద్యార్థులు వాపోతున్నారు. అసౌకర్యాల నడుమ విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. హాస్టల్‌కు నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.2 లక్షలతో వైరింగ్ పనులు కూడా చేపట్టారు. ఈ వైరింగ్ పూర్తిగా దెబ్బతింది. నాసిరకం మెటీరియల్ వినియోగించడంతో బోర్డులు పగిలిపోయాయి. దీంతో విద్యార్థులకు ఎప్పుడు షాక్ కొడుతుందోనని భయపడుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లు

కంపు కొడుతున్న మరుగుదొడ్లు

మరుగుదొడ్ల పనుల్లో నాణ్యత పాటించక పోవడంతో కంపు కొడుతున్నాయి. బాత్ రూములు, మరుగుదొడ్లకు నీరు వెళ్లకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూములలో స్నానం చేయకుండా మోటార్ వద్ద బయట స్నానాలు చేస్తున్నారు. మరుగుదొడ్లు కంపు కొట్టడంతో హాస్టల్ పక్కనే ఉన్న గ్రోత్ సెంటర్ ఖాళీ స్థలాలకు విద్యార్థులు బహిర్భూమికి వెళ్తున్నారు. రాత్రి సమయాలలో అత్యవసర పరిస్థితులలో కూడా మరుగుదొడ్లు వినియోగించే అవకాశం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

పని చేయని ఆర్‌ఒ ప్లాంట్

విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. వాటర్ ప్లాంట్ పని చేయకపోవడంతో బోరు నీటిని తాగాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రహరీ లేక..

వసతిగృహానికి ప్రహరీ లేకపోవడంతో హాస్టల్లోకి కుక్కలు ప్రవేశిస్తున్నాయి. భోజనాలు చేసే సమయంలో కుక్కలు కిచెన్ లోపలికి కూడా వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఎవరినైనా కరిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. కుక్కలు రాకుండా ప్రహరీ నిర్మించాలని, గేటు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

అపారిశుధ్యంగా హాస్టల్ పరిసరాలు

హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సి ఉన్నప్పటికీ ఆ పని చేయడం లేదు. చెత్త, మిగిలిన ఆహార వ్యర్థాలు హాస్టల్ పరిసరాలలోనే వేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు.



హాస్టల్‌లో సంచరిస్తున్న కుక్క

బోరు పాడైతే నీటి కోసం అవస్థలే

హాస్టల్లో ఉన్న బోరు పాడైతే నీటి కోసం విద్యార్థులు, సిబ్బంది అవస్థలు పడాల్సిందే. ఒక బోరు మాత్రమే ఉండడంతో విద్యుత్ లేకపోయినా, మోటార్ పాడైపోయినా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు చెపుతున్నారు. హాస్టల్ ఆవరణలో చేతిపంపు బోరు వేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

పంట నష్టం 1664 ఎకరాల్లో..

నష్ట పోయిన రైతులు 3,076 మంది : జిల్లా వ్యవసాయ అధికారి వి టి రామారావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈనెల 24 నుండి 30 వరకు ప్రభావం చూపిన మొంథా తుపాను కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో పంటలకు గణనీయమైన నష్టం సంభవించిందని జిల్లా వ్యవసాయ అధికారి వి టి రామారావు తెలిపారు. నేపథ్యంలో కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని మొత్తం 27 మండలాల్లో పంట నష్టాల అంచనా పూర్తి చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1664ఎకరాల్లో 3,076 మంది రైతులు పంట నష్టం చవిచూశారని తెలిపారు. వరి 1610 ఎకరాలు, మొక్కజొన్న: 16 ఎకరాలు, పత్తి 12 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. రైతుల వివరాలన్నీ ఎపిఎఐఎంఎస్ పోర్టల్ https://aspire.ap.gov.in/natural-calamities లో ఎంట్రీలు వేశామని తెలిపారు. సంబంధిత రైతు సేవా కేంద్రాల వద్ద సామాజిక ఆడిట్ కోసం ప్రదర్శించినట్లు తెలిపారు. రైతులు తమ వివరాలను సరిచూసుకుని, అభ్యంతరాలను, ఫిర్యాదులను సంబంధిత మండల వ్యవసాయ అధికారికి రాత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఇప్పటివరకు అంచనా చేయబడని పంట నష్టాల వివరాలు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ (ఫోన్: 8331056279) కు తెలియజేయవచ్చున్నారు. తుపాను కారణంగా నష్ట పోయిన అర్హులైన ప్రతి రైతుకు, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సహాయం అందజేస్తామని తెలిపారు.

టెట్ నుంచి మినహాయించాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్‌నుంచి మినహాయించాలని డిఆర్‌ఒకు శ్రీనివాసమూర్తికి ఫ్యాప్టో నాయకులు వినతి అందజేశారు. ఆర్‌టిఇ చట్టం 2010కు మునుపు సర్వీసులో నియామకమైన టీచర్లకు కూడా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ను పాస్ కావాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని అయితే విద్యా హక్కు చట్టం 2009 అమలులోకి వచ్చిన తరువాత కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2011లో జీవో నెంబర్ 51 ద్వారా, ఇంకా వివిధ సందర్భాలలో కూడా ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ టెట్ వలన ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాలు పెరిగే అవకాశం లేదని తెలిపారు. 15 సంవత్సరాల పైబడి సర్వీస్‌లో ఉన్న టీచర్లకు ఇప్పుడు కొత్తగా టెట్ పరీక్షను పెట్టడం వలన అదనంగా ఒనగూరే ప్రయోజనం లేదని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో ఫ్యాప్టో చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు ఈశ్వరరావు, రమేష్‌చంద్రపట్నాయిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతి అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

పంట నష్టాలపై

సమగ్ర పరిశీలన జరపాలి

- రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మొంథా తుపాను వల్ల కలిగిన పంట నష్టాలపై అధికార యంత్రాంగం కంటి తుడుపుగా కాకుండా సమగ్ర పరిశీలన చేసి రైతులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు వరికి ఎకరాకు రూ.50 వేలు, పత్తికి రూ.30 వేలు, మొక్క జొన్న పంటకు రూ. 20 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. ఆదివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొంథా తుపాను నష్టాన్ని రూ.190 కోట్లు గా అంచనా వేశారని, వాస్తవానికి అంతకంటే ఇంకా ఎక్కువగా నష్టం జరిగిందని అన్నారు. 1664 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ప్రకటించారని తెలిపారు. 150 కిలోమీటర్లు రోడ్లు, 90 ఇళ్లు కూలిపోయినట్లు లెక్కలు చెప్పారని వివరించారు. సిపిఎం నాయకులు పర్యటించిన రామభద్రపురం మండలంలో పత్తి బాగా దెబ్బతిన్నదన్నారు. వరి, పత్తి, మొక్క జొన్న వంటి పంటలకు 50 శాతం వరకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. కొత్తవలస ప్రాంతంలో సబ్బవరం రోడ్డులో సుమారుగా 15 గ్రామాలకు దారి బంద్ అయిందన్నారు. సబ్ వే నిండిపోవడం వలన అనేక గ్రామాలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నానిపోయిన కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పత్తి పంటకు ఎకరాకు 30 వేలు పెట్టుబడి పెడితే తుపాను కారణంగా 20 వేలు కూడా రాకుండా పోయిందన్నారు. రైతులు ఎక్కువగా నష్టపోయినందున వరికి రూ.50వేలు, పత్తికి రూ.30 వేలు, మొక్క జొన్నకు రూ.20వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

అధ్వానం.. నరకయాతన

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

బొబ్బిలి నుంచి కారాడ మీదుగా తెర్లాం వైపు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ఆ మార్గం గుండా వెళ్లాల్సిన భారీ వాహనాలను దారి మళ్లించి, ఆకులకట్ట, తెర్లాం, కారాడ మీదుగా బొబ్బిలి వైపు పంపిస్తున్నారు. దీంతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు ఎక్కడికక్కడ దారుణంగా తయారైంది. ఇటీవల ఈ రహదారి నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. 10 రోజుల క్రితం పనులు ప్రారంభించారు. మొంథా తుపాను కారణంగా పనులకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు చిన్న చిన్న గుంతలు కాస్తా పెద్ద గోతులుగా మారాయి. రోడ్డుపై మరింత లోతుగా గోతులు కావడం ఎక్కడపడితే అక్కడ లారీలు దిగిపోయి ప్రతిరోజూ ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతోంది. దీంతో మిగతా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుపోయి నరకయాతన అనుభవిస్తున్నారు. మరోవైపు అలజంగి దగ్గర తోటపల్లి కాలువపై, పినపెంకి వద్దనున్న కాజ్‌వేలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఈ మార్గం మీదుగా భారీ వాహనాలు రాకుండా మళ్లించాలని కారాడ వాసులు కోరుతున్నారు.



నిలిచిపోయిన వాహనాలు



గోతిలో దిగిన భారీ వాహనం

దేవాలయాలపై దృష్టిపెట్టండి : కలెక్టర్

కంటోన్మెంట్ : ఈ నెల 3న కార్తీక సోమవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున దేవాలయాలపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. దేవాలయాల వద్ద తగు భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్య చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులు క్రమశిక్షణతో, శాంతియుతంగా దర్శనాలు ముగించుకోవాలని, ఏవైనా అసౌకర్యాలు గమనించిన వెంటనే దేవాలయ నిర్వహణ లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు.

వికలాంగ ఉద్యోగుల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

విజయనగరం టౌన్ : జిల్లా నూతన రాష్ట్ర చెవిటి వికలాంగ ఉద్యోగులు కార్యవర్గం ఎన్నికలు ఆదివారం రెవెన్యూ హోంలోజరిగాయి. ఎన్నికల అధికారిగా పట్టణ ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు వై .ఆనందకుమార్, సహాయ ఎన్నికల అధికారిగా ఎం. శ్రీనివాసరావు వ్యవహరించారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టి.సూర్యనారాయణ, వి .అచ్యుతరామమూర్తి, అసోసియేట్ అధ్యక్షులుగా సి హెచ్ రవికుమార్, ఉపాధ్యక్షుడుగా డి. రాధ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అర్.రాజీవ్, సంయుక్త కార్యదర్శిగా నాగా అప్పలవరం, కోశాధికారిగా అర్.సురేష్ కుమార్, మహిళా కార్యదర్శిగా ఎం. మాధవి, ఇసి మెంబర్లుగా ఎం.అలైక్య, పి.చక్రవర్తి, ఎస్.ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోను చెక్ చేసుకోవచ్చున్నారు. ప్రజలు పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలి

అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు.

తొక్కిసలాట మృతులకు ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి,-విజయనగరం కోట

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి టెంపుల్ లో జరిగిన తొక్కిసలాటలో 9మంది భక్తుల మృతికి ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు సంతాపం తెలిపారు. ఆదివారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆలయంలో జరిగిన ఈ సంఘటన దురదృష్ట కరమన్నారు, ఎక్కువ మంది భక్తులు రావడంతో ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. మతుల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం తరపున రూ.15 లక్షలు, కేంద్ర ప్రభుత్వం తరపున రెండు లక్షలు కలిపి రూ.17లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు గంటా రవి, కార్యదర్శి కోదండరాం, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలి నాయుడు, కార్యదర్శి పాశి అప్పలనాయుడు, ఎఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, మహిళా పార్లమెంట్ అధ్యక్షులు అనురాధ బేగం తదితరులు పాల్గొన్నారు.

పశువధ నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి

కంటోన్మెంట్ : నగరంలోని కంటోన్మెంట్‌లో వచ్చిన సమాచారం మేరకు పశు వధ శాలలపై వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని 600 కిలోల మాంసం, రెండు వాహనాలు, మూడు కత్తులు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. జిల్లాలో ఇటువంటి పశువధ శాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి హెచ్చరించారు. ఇటువంటి అసాంఘిక కార్య క్రమాలు జరిగితే పోలీసులకు గాని 100/112కు గాని సమాచారం అందించాలని కోరారు.

రౌడీషీట్లు ఓపెన్‌చేయాలి

విజయనగరం టౌన్ : కంటోన్మెంట్ లో మసీదు చుట్టు పక్కల కబేళాలు నిర్వహిస్తున్న వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా గో సంరక్షణ కార్యాలయం లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆవులను చంపే కబేళాలల నుండి మాంసం సరఫరా జరుగుతుందని, ఈ అక్రమ మాంసం వ్యాపారులపై రౌడీ షీట్లు, సస్పెక్టెడ్ షీట్లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి పశు మాంస విక్రయాలను అరికట్టాలని అన్నారు.





తైక్వాండో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన విజయనగరం జట్టు ; బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్ఇ లక్ష్మణరావు

ఓవరాల్ ఛాంపియన్ విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నవంబర్ 1, 2 తేదీల్లో ఏలూరులో జరిగిన 69వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరంజిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్ సాధించింది. ఉమ్మడి 13 జిల్లాల నుండి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరందరినీ రాష్ట్ర స్కూల్ గేమ్స్ అబ్జర్వర్ వెంకటేశ్వరరావు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి లు అభినందించారు.

బాడ్మింటన్ ఓవరాల్ ఛాంపియన్‌గా విజయనగరం

ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన ఇంటర్ సర్కిల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను విజయనగరం జట్టు గెలుచుకుంది. గెలిచిన విజయనగరం జట్టు టీమ్ ఈవెంట్‌లో మొదటి స్థానం, ఓపెన్ డబుల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాయి. లోకేష్.సింహాచలం. ఓపెన్ సింగిల్స్‌లో విడి గిరి ద్వితీయ స్థానంలో నిలిచారు. టీమ్ ఈవెంట్ సభ్యులు పైడిరాజు, గిరి, బి.లోకేష్, వై.ఓంకార్ పాల్గొన్నారు. ఆలిండియా కబడ్డీ లో కె .మోహనరావు తృతీయ స్థానంలో నిలిచారు. బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో మణి బాబు నిలిచారు. విజేతలను ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ మువ్వల లక్ష్మణరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ పి. త్రినాధరావు, జనరల్ సెక్రటరీ మోహన్ బాబు, గేమ్స్ సెక్రటరీ ఎస్.అప్పలనాయుడు, లక్ష్మీనారాయణ, విద్యుత్ ఉద్యోగులు అభినందించారు.

బాడ్మింటన్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజ్జి స్టేడియంలో అండర్ 14, 17 బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు సోమవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగిగాయి. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు 5వ తేదీ నుండి 7 వ తేదీ వరకు తిరుపతిలో జరగబోయే పోటీలలో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి లు తెలిపారు. ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర పోటీలకు స్విమ్మింగ్ జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 3,4 తేదీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరుగనున్న అండర్ 17 స్విమ్మింగ్ పోటీలకు ఆదివారం జిల్లా స్విమ్మింగ్ క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. టీమ్‌కు కోచ్ గా పెద్ద బోరబంద హైస్కూల్ పీడీ సీతారాం నియమితులయ్యారు. క్రీడాకారులు రాష్ట్ర విజేతలుగా తిరిగి రావాలని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి లు ఆకాక్షించారు.

నేడు క్రికెట్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్కూలుగేమ్స్ అండర్ 14 బాలురు, అండర్ 17 బాలికల క్రికెట్ జట్లు ఎంపిక సోమవారం ఉదయం 9 గంటలకు విజ్జీ స్టేడియంలో జరుగుతుందని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సకాలంలో ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ తో హాజరు కావాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటాలి

ప్రజాశక్తి - సంతకవిటి

మండవకురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్, స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం వారు రాష్ట్ర స్థాయి పోటీలకు బయలుదేరారు. ఎంపికైన విద్యార్థులు ఎం.నోసియా, పి.మేఘన, సి.హెచ్.అర్చన, ఎ.సాయి, భార్గవి, నానిని ప్రధానోపాధ్యాయులు ముద్దాడ రమణమ్మ, ఎస్ఎంసి పాఠశాల చైర్మన్, వ్యాయామ ఉపాధ్యాయుడు యు.సుదర్శనరావు అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి విద్యాధర్, సాహితీవేత్తలు

'స్వేచ్ఛ నా సందేశం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జివిఎస్ జైపాల్ రావు రాసిన కవిత్వం 'స్వేచ్ఛ నా సందేశం' పుస్తక ఆవిష్కరణ జెడ్‌పి సమావేశ మందిరంలో ఆదివారం అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగింది. అరసం అధ్యక్షులు జిఎస్ చలం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి కార్యదర్శి రత్నాల బాలకృష్ణ ఆహ్వానం పలికారు. సుప్రసిద్ధ కవి విమర్శకులు, విమల సాహితీ అధ్యక్షులు విద్యాధర్ పుస్తకావిష్కరణ చేశారు. స్వేచ్ఛ దేశానికి అవసరమని, అటువంటి స్వేచ్ఛా సందేశాన్ని తన ప్రతి కవితలోను వినిపించారన్నారు. ముఖ్యఅతిథులుగా విచ్చేస్తున్న ప్రముఖ కవి, విమర్శకులు, సినీగీతాల రచయిత బిక్కి కృష్ణ ప్రసంగిస్తూ దేశ, ప్రాంత, సామాజిక సమస్యలన్నింటిపైనా తన కవితలలో నిశితంగా విమర్శించారన్నారు. ప్రముఖ రచయిత, కవి గంటేడ గౌరునాయుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కందుల సురేఖ ప్రసంగించారు. కవి, విమర్శకులు సుంకర గోపాలయ్య పుస్తకాన్ని సమీక్ష చేశారు. ప్రముఖ రచయిత పాయల మురళీకృష్ణ పుస్తకానికి ఆప్త వాక్యాన్ని అందించారు.

వెయిట్ లిఫ్టర్లకు అభినందన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయిలో అంతర్ కళాశాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. 79 కిలోల విభాగంలో ఆర్.రాంబాబు, 69 కిలోల విభాగంలో ఎస్.పల్లవి, 63 కిలోల విభాగంలో ఎ.యశస్వి, 58 కిలోల విభాగంలో టి.లావణ్య స్వర్ణాలు సాధించారు. 65 కిలోల విభాగంలో ఎ. లిఖిత, 63 కిలోల విభాగంలో జి.శ్రావణి, 60 కిలోల విభాగంలో జి.కిరణ్ కుమార్ రజత పతకాలు సాధించారు. వీరితోపాటు కోచ్ చల్లా రామును మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు, టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, కంది చంద్ర శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యే అభినందన

విజయనగరంకోట : విజయనగరం జిల్లా తరఫున శనివారం విశాఖపట్నం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ సిల్వర్ మెడల్ సాధించిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అభినందించారు. ఆదివారం ఎమ్మెల్యేను వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు కలిశారు. ఈ సందర్భంగా ఆమె అభినందిస్తూ జిల్లాకు మరిన్ని పతకాలు తేవాలని అన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ వి. శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ సిహెచ్. రాము పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు

మెగా డిఎస్‌సిలో అన్యాయం

జాతీయ బాడీ బిల్డర్ ఆవేదన

ప్రజాశక్తి-చీపురుపల్లి

మెగా డిఎస్‌సి ఫలితాలలో తనకు తీరని అన్యాయం జరిగిందని వంగపల్లిపేట గ్రామానికి చెందిన జాతీయ బాడీబిల్డర్ రెడ్డి లక్ష్మునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చీపురుపల్లి ప్రెస్‌క్లబ్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రీడాకారుల కోటాలో టిజిటి ఇంగ్లీష్ సబ్జెక్టులో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. మెరిట్ జాబితాలో 55వ స్థానంలో మొదటి లిస్టులో పెట్టారన్నారు. ఆగస్టు రెండో తేదిన విజయవాడలో ధ్రువపత్రాలు కూడా పరిశీలించారన్నారు. సెప్టెంబర్‌లో విడుదల చేసిన ఫలితాలలో తన పేరు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడాకారుల కోటాలో 55వ ర్యాంకులో ఉన్న తనను తప్పించి 96వ ర్యాంకులో ఉన్న ముదిరాజ్ జనార్ధనరావు అనే అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ క్రీడాకారుడికి కేటాయించడం అన్యాయమని వాపోయారు. తనకు జరిగిన అన్యాయాన్ని అధికారులు సూచించిన వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసినా ఏఒక్కరూ పట్టించుకోలేదన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.



సమస్యలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ఆవేదన చెందొద్దు

మాజీ ఎమ్‌పి బెల్లాన భరోసా

ప్రజాశక్తి -చీపురుపల్లి

మెంథా తుపాను కారణంగా నష్టం జరిగిన ఏ ఒక్కరూ ఆవేదన చెందవద్దని, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ ప్రజలకు భరోసాఇచ్చారు. ఆదివారం చీపురుపల్లి పట్టణంలో పలు వార్డులలో వైసిపి నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. పిల్లపేట, హడ్కో కాలనీ, శివాలయం వీధిలో ప్రజల నుండి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా స్థానికులు పడుతున్న ఇబ్బందులను గమనించి, శానిటేషన్, తాగునీరు క్లోరినేషన్, పరిసరాల పరిశుభ్రత అంతా సక్రమంగా జరగాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు ముల్లు పైడిరాజు, గరిడి రాందాసు, వార్డు సభ్యులు కర్ణపు ఆదినారాయణ, సూరు దుర్గారావు, బలగ రమేష్, మహంతి ఉమా, పతివాడ అప్పారావు, ఆది కృష్ణ, ఇజ్జురోతు రమణ, ఒమ్మి రమేష్ , రైటర్ బుజ్జి పాల్గొన్నారు.

బాడంగి విద్యార్థినికి అరుదైన అవకాశం

ప్రజాశక్తి-బాడంగి



కోమలి

మండలంలోని బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు అరుదైన గౌరవం దక్కింది. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఆ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని మరడాన కోమలి ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ నెల 26న శాసనసభలో జరిగే రాష్ట్ర స్థాయి ఉత్సవాల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. అదే రోజు నిర్వహించే మాక్ అసెంబ్లీ సమావేశాల్లో, సిఎం చంద్రబాబు, విద్యా శాఖా మంత్రి లోకేష్, ఇతర మంత్రులు పాల్గొనే అవకాశముంది. దీంతో కోమలిని ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యనారాయణ, ఉపాధ్యాయులు గోవిందరావు అభినందించారు.

ప్రజలను చైతన్యవంతం చేయాలి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ప్రభుత్వం తాను చేయాల్సిన పనుల నుంచి తప్పించుకుంటే ప్రశ్నించేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జిఅన్నారు. భీశెట్టి మరోసారి అధ్యక్షుడి నియమితులైన సందర్భంగా ఆదివారం స్థానిక యూత్ హాస్టల్లో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భీశెట్టి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ ముఖ్యంగా ఎన్నికల వ్యవస్థ అత్యంత దారుణమైన స్థితిలో ఉందని, కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దేశంలో, రాష్ట్రంలో రాజకీయ పార్టీలు లేవని ప్రవేటు లిమిటెడ్ కంపెనీలు మాత్రమే ఉన్నాయని విమర్శించారు. యువజన, మహిళా సంఘాలు ప్రతి నియోజకవర్గానికి ఒక అజెండా తయారు చెయ్యాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కన్స్యూమర్ ఫోరం మాజీ న్యాయమూర్తి పెంటపాటి రుక్మిణి, లోక్ సత్తా మహిళా నేత ఇనగంటి అనతలక్ష్మి, సమన్విత ఏజెన్సీ అధినేత జి.నాగిరెడ్డి, విశ్రాంతి చీఫ్ బ్యాంకింగ్ అధికారి పిడకల ప్రభాకరరావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మరిసర్ల కృష్ణమూర్తి నాయుడు, దవడ కొండబాబు, గెద్ద చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఆకలి మంటలతో అలమటిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి డిమాండ్‌చేసింది. ఈ నెల 8న విజయనగరంలో జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాజన సభను విజయవంతం చేయాలంటూ ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద నాయకులు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులకు గురవుతున్నామంటూ వాపోయారు. సమాన పనికి సమాన వేతనం, హెచ్‌ఆర్ పాలసీ అమలు, వార్షిక ఇంక్రిమెంట్, హెల్త్ కార్డులు మంజూరు, ప్రభుత్వ పథకాలు అమలు వంటి ప్రధాన డిమాండ్లతో మహాజనసభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సభకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి డివిజన్ అధ్యక్షులు మీసాల లక్ష్మణరావు, ప్రధానకార్యదర్శి రౌతు కనకరాజు, సభ్యులు రామకృష్ణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కొండకరకాంలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

మొంథా తుపాను వల్ల కలిగిన పంట నష్ట వివరాలపై సామాజిక తనిఖీ నిర్వహించాలన్న అధికారుల ఆదేశాలతో ఆదివారం కొండకరకాంలో వ్యవసాయశాఖ ఎఒ శ్రీనివాసరావు ఆధ్వర్యాన గ్రామసభ నిర్వహించి పంట నష్ట వివరాల జాబితా ప్రదర్శించారు. అభ్యంతరాలు ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఆర్. కవితకు తెలపాలని సూచించారు.

'దళిత కాలనీకి రోడ్డు నిర్మిస్తా'

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో పరిధిలో తొమ్మిదో వార్డు దళిత కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పిస్తానని ఏడో వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆదివారం ఆయనను పదోవార్డు కౌన్సిలర్ నరవ రామలక్ష్మి కలిసి, తొమ్మిదో వార్డు మిమ్స్ బ్రిడ్జి డౌన్, దళిత కాలనీకి వెళ్లే రోడ్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వివరించారు. దీనిపై కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ దళిత కాలనీని సందర్శించి రోడ్డు సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టకుంటే సొంత నిధులతో రోడ్డు నిర్మిస్తానని ప్రసాద్ హామీ ఇచ్చారు.



దళిత కాలనీని పరిశీలిస్తున్న కౌన్సిలర్ ప్రసాద్

అన్నదాతలకు కడ'గండ్లు'

- కొత్తబగ్గాం సమీపంలో కాలువకు ఏటా గండి
- నీటిపాలవుతున్న వరిపంట పొలాలు
- భారీవర్షాల సమయంలో రైతులకు సాహసమే
- దశాబ్దాలుగా రైతుల మట్టి సంచుల పోరాటం



గండి పడకుండా ఏర్పాటుచేసిన మట్టి సంచులను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గజపతినగరం

ప్రతి ఏటా తుపాను, భారీ వర్షాల సమయాల్లో కొత్తబగ్గాం, గంగుచోళ్లపెంట, పాతబగ్గాం రైతులకు కన్నీళ్లు మిగులుతున్నాయి. నాలుగు రోజులపాటు మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు సుమారు 40 మందికి చెందిన రైతులకు చెందిన 30 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగిపోయింది. తీవ్ర నష్టం వాటిల్లింది. ముంపునకు గురైన విషయాన్ని స్థానిక రైతులు.. టిడిపి సీనియర్ నాయకులు బొత్స రమణ, బొత్స సూర్యనారాయణకు తెలియజేయగా, వారు ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకొని వెళ్లి సమస్య పరిష్కారం అయ్యే విధంగా ప్రయత్నిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సమస్య రెండు దశాబ్దాలుగా రైతులను వెంటాడుతూనే ఉంది.

దశాబ్దాలుగా పోరాటం

చంపావతి నది నుంచి కొత్తబగ్గాంలోని లింగాలచెరువుకు సాగునీటిని మళ్లించేందుకు కాలువ ఏర్పాటు చేశారు. గంగుచోళ్లపెంట, పాతబగ్గాం, మధుపాడ, ఎం.గుమడాం, లింగాలవలస రైతుల పంట పొలాలకు ఇదే కాలువ ద్వారా నీరు వెళ్లాల్సి ఉంది. కొత్తబగ్గాం గ్రామంలో ఉన్న లింగాలచెరువు నిండి కాలువ ఆయకట్టుకు సాగునీరు వెళ్లడానికి ప్రతి ఏటా రైతులు పెద్ద యుద్ధమే చేస్తున్నారు. నీటిమళ్లింపు కోసం ఏర్పాటుచేసిన నీలకుండీల సమీపంలో 40 మీటర్ల మేర కాలువ గట్టు ఇటీవల తుపాను సమయంలో అధిక నీటి ప్రవాహంతో తెగిపోయింది. ఈ ప్రాంతంలో కాలువ గట్టు బలహీనంగా ఉండడంతో సమస్య ఏర్పడుతోంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఇదే సమస్య వెంటాడుతోంది. వర్షాలు అధికమైన ప్రతిసారీ ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూడకుండా పాతబగ్గాం గ్రామంలోని 200 మందికి పైగా రైతులు స్వయంగా గోనెసంచెల్లో మట్టిని నింపుకొని, తెగిపోకుండా గట్టును కాపాడుకుంటున్నారు. ఈసారి కూడా ఇదే తరహాలో పాత బగ్గాం మాజీ సర్పంచ్ లెంక చిన్నంనాయుడు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ట్రాక్టర్ సహాయంతో కష్టపడి 1500 బస్తాలకు మట్టిని సేకరించి కాలువ గట్టును నిర్మించారు. కానీ, ఈసారి తుపాను ఉధృతికి ఆ మట్టి సంచులు కూడా కొట్టుకుపోయాయి. ఏళ్లుగా చేస్తున్న ఈ పోరాటం చేస్తున్నామని, ఈసారి తమకు ప్రయోజనం లేకుండా పోయిందంటూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాలువను పరిశీలిస్తున్న నాయకులు

శాశ్వత పరిష్కారమే మార్గం : సిపిఎం

రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారమే మార్గమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ తెలిపారు. సాగునీటి కాలువకు రిటర్నింగ్ వాల్ నిర్మించడానికి ఎంత సమయం పడుతుందో మంత్రి శ్రీనివాస్‌తోపాటు సంబంధిత అధికారులు స్పందించి కచ్చితమైన సమయం చెప్పాలని కోరారు.

నివేదిక పంపించాం

ఇదే విషయంపై 'ప్రజాశక్తి' గజపతినగరం ఇరిగేషన్ జెఇ సురేష్ వద్ద ప్రస్తావించగా సమస్య గత కొంతకాలంగా ఉన్న విషయం వాస్తవమేనని తెలిపారు. నీలకుండీలు మరమ్మతులతోపాటు 35 మీటర్ల కాలువ గట్టు నిర్మించాల్సి ఉందని చెప్పారు. సుమారు రూ.15 లక్షల అంచనా వ్యయంతో రిటర్నింగ్ వాల్ నిర్మించాల్సి ఉందని, మరికొన్ని చోట్ల మరమ్మతులకు సంబంధించి నివేదికను కలెక్టర్‌కి, ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. పనులకు ఆమోదం తెలిపిన వెంటనే ప్రారంభిస్తామన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దుర్మార్గం

మాజీ ఎమ్మెల్యే శంబంగి



బాడంగి.. పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, నాయకులు

ప్రజాశక్తి-బాడంగి

ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఆదివారం బాడంగి మండలం వాడాడ గ్రామంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల కలిగే నష్టాన్ని వివరించారు. పేదలకు విద్య, వైద్యం దూరం చేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని అన్నారు. ఈ చర్యలను ప్రజలంతా తిప్పికొట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అనుబంధ విభాగాల ప్రధాన కార్యదర్శి శంబంగి వేణుగోపాల నాయుడు, జడ్‌పిటిసి పెద్దింటి రామారావు మండల అధ్యక్షులు యమల శివప్రసాద్, యువజన అధ్యక్షుడు బేతనపల్లి శంకర్రావు,మాజీ బుడా చైర్మన్ ఇంటి గోపాలరావు, గొట్టాపు రామారావు, వివిధ గ్రామస్థాయి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు కోరారు. ఆదివారం జరజాపుపేటలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేయడాన్ని వ్యతిరేకించాలని కోరుతూ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం, పేద విద్యార్థులకు ఉచిత వైద్యవిద్య అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని ప్రయివేట్‌పరం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టడానికి కోటి సంతకాలు సేకరణ చేపట్టి, ఈ నెల 11న నియోజకవర్గ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పోలుబోతు నారాయణ మూర్తి, నల్లి శ్రీను, మన్యపురి మోహనరావు, తుమ్ము నారాయణ మూర్తి, పి.అప్పలరాజు, కనకల హైమావతి, బి.తిరుపతి రావు, నల్లి శివ, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నియోజకవర్గ యువజన, విద్యార్థి విభాగాల ఇన్చార్జ్ కౌశిక్ ఈశ్వర్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. పలు కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రైవేటీకరణ వల్ల పేద ప్రజలకు, విద్యార్థులకు వాటిల్లే నష్టాన్ని వివరించారు.



నెల్లిమర్ల.. పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ చైర్మన్ రామారావు, నాయకులు

వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ

ప్రజాశక్తి -కొత్తవలస

తుమికాపల్లి గ్రామం వద్ద ఉన్న ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 45 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. లెంక రాజు, సౌజన్య దంపతులతోపాటు వ్యాపార వేత్త గోపి, సంజీవని మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ చంద్రశేఖర్, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, లోక్కిరెడ్డి గణేష్, ట్రస్ట్ సభ్యుల ఆర్థిక సహాయంతో వీటిని అందజేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు గణేష్, బుజ్జి, నగేష్ ,కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎర్రన్నకు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు



ఎర్రన్నకు ఘన నివాళి

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని తాలాడ గ్రామంలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపిటిసి వల్లూరు గణేష్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు మన్నేన రమేష్, నాయకులు కలిసి ఎర్రన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎర్రన్న ప్రజల సమస్యలను తనవిగా భావించి అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారని వారు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎం.అప్పలనాయుడు, ఎం గోవిందరావు, గెడ్డాపు. జనార్ధన్, ఉమామహేష్, కె.సింహాచలం పాల్గొన్నారు.

వంగర : కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతిని అరసాడ పెట్రోల్ బంక్ వద్ద ఎఎంసి వైస్ చైర్‌పర్సన్ లచ్చుబుక్త ధనలక్ష్మి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పిన్నింటి మోహన్‌రావు, చింత అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొంథా విజేతలకు అభినందన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మొంథా తుపాను సమయంలో తమ తమ రంగాలలో విశేష సేవలు అందించిన ముగ్గురు అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 'సైక్లోన్ మోన్తా ఫైటర్ అవార్డులు' అందుకున్న సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్. రామ సుందర్ రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన అధికారులు కూడా ముందుకు సాగాలని కోరారు.

కొత్తూరు రామచంద్రపురం విఆర్‌ఒ ఎ.రాజమోహన్ నాగావళి నదిపై 24గంటలూ నిఘా ఉంచి గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించకుండా ఇసుక బస్తాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడారు. మెంటాడ మండలం లక్ష్మీపురానికి చెందిన ఆశావర్కరు వై.బంగారమ్మ, తీవ్ర వర్షాల కారణంగా ప్రధాన రహదారి తెగిపోవడంతో కూడా ఓ గర్భిణిని సురక్షితంగా మరో మార్గం ద్వారా అంబులెన్స్ వద్దకు చేర్చి, తల్లి, శిశువును రక్షించడంలో అపూర్వమైన సేవలు అందించారు.

మైనర్ ఇరిగేషన్ ఇఇ ఎంవి రమణ జిల్లాలోని 8వేల ఎంఐ ట్యాంకుల రక్షణలో ఫీల్డ్ సిబ్బందిని సమర్థవంతంగా సమన్వయం చేస్తూ, బండ్ల దెబ్బతినకుండా కృషి చేశారు. వీరు ముగ్గురూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్,కలెక్టర్ రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ మొంథా తుపాను సమయంలో ప్రజాసేవలో చూపిన వీరి అపూర్వమైన కర్తవ్య నిబద్ధత ప్రభుత్వానికి గర్వకారణమని, ఈ అవార్డులు జిల్లాకు గౌరవం తీసుకొచ్చాయని పేర్కొన్నారు.



సిఎం నుంచి అవార్డు అందుకుంటున్న ఇఇ రమణ

పోరంబోకు స్థలం కాదు.. పిహెచ్‌సి

ప్రజాశక్తి-వేపాడ

ఈ చిత్రాన్ని చూస్తే ఇదేదో అటవీ ప్రాంతమో, లేక పోరంబోకు స్థలమో అనుకుంటారు సుమా! అయితే మీరు పొరపడినట్టే. ఇది వేపాడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. పిహెచ్‌సి ఆవరణలో తుప్పలు, డొంకలు పెరిగి ప్రమాదకరంగా తయారయ్యాయి. దీనివల్ల వైద్య సేవలకు వచ్చే రోగులు, రాత్రివేళల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. వైద్యం కోసం వస్తే ఏదైనా విషసర్పం కాటేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని రోగుల బంధువులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జంగిల్ క్లియిరెన్స్ చేపట్టాలని కోరుతున్నారు.



పిహెచ్‌సి ఆవరణలో ఉన్న తుప్పలు, డొంకలు



ఎపి రైతుసంఘం జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలం, నాయకులు

జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల 9న శృంగవరపుకోటలో జరిగే ఎపి రైతుసంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలం కోరారు. బొబ్బిలిలో ఆదివారం ఎపి రైతు సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం, మొక్కజొన్న, చెరకు, అపరాలు, పత్తి, కూరగాయలు, పాడి, మామిడి, జీడి, ఆయిల్‌పామ్ తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే, ఇతర భూ నిర్వాసిత రైతుల, సాగునీటి ప్రాజెక్టుల సమస్యలు జిల్లాలో పరిష్కారానికి నోచుకోవడం లేదని చెప్పారు. భూముల సర్వేల పేరుతో రెవెన్యూ యంత్రాంగం తప్పుల తడకగా మార్చిందన్నారు. ఈ సమస్యలన్నింటిపైనా రైతు సంఘం పోరాడుతోందన్నారు. వీటిపై మహాసభలో చర్చించి, భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా బడే త్రినాథ్, కార్యదర్శిగా ఉడమల ప్రసాదు, కోశాధికారిగా రాపాక శ్రీను, ఉపాధ్యక్షులుగా రెడ్డి త్రినాథ, లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా చౌక్కాకు తిరుపతిరావు ఎన్నికయ్యారు.

బొబ్బిలిలో క్రికెట్ సందడి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆస్ట్రేలియా-ఇండియా మహిళా జట్ల మధ్యజరుగుతున్న క్రికెట్ వరల్డ్‌కప్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే బేబినాయన తిలకించారు. క్రికెట్ తిలకించేందుకు కోటలో స్క్రీన్ ఏర్పాటు చేశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలసి మ్యాచ్ తిలకించారు.

గణిత పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి-వంగర

మండలంలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చిక్కోలు గణిత టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. అరసాడ, వంగర, బాగెంపేట తదితర పాఠశాలకు చెందిన 125 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలు త్వరలో జరిగే జిల్లాస్థాయి పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని అడ్డూరివానిపాలెం సమీపంలో రాయల్ సిటీలో నివాసం ఉంటున్న ఎల్లపు హేమ సింహ రాఘవేంద్రరావు (35) శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాఘవేంద్రరావు సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తూ అధికంగా అప్పులు చేశాడు. ఆరోగ్యపరంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎఎస్‌ఐ జనార్ధనరావు తెలిపారు. ఆయన తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సిఐ సిహెచ్ షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బస్సు ఎక్కుతూ కాలుజారి పడి

అస్సాం వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కొత్తవలస



మృతిచెందిన దీపక్

కొత్తవలస కూడలిలో ఆదివారం సిటీ బస్సు కిందపడి అస్సాం రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... అస్సాం రాష్ట్రానికి చెందిన దీపక్ బౌమిక్ (33) గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు చేస్తున్నాడు. మరికొందరితో కలిసి కొత్తవలసకు వచ్చాడు. ఆదివారం బస్సు ఎక్కే ప్రయత్నంలో కాలుజారి బస్సు కింద పడ్డాడు. బస్సు అతని పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని కె.వెలగాడ గ్రామానికి చెందిన చౌడువాడ దాలినాయుడు (75) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. దాలినాయుడు కుమారుడు నూకరాజు విశాఖపట్నంలోని వేపగుంటలో ఉంటున్నాడు. ఆయనకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుమారుడి వద్ద కొన్ని రోజులు ఉన్నాడు. పింఛను తీసుకునేందుకు తమ కోడలు ప్రియాంకను తీసుకొని కె.వెలగాడ వచ్చారు. ఆదివారం పింఛను తీసుకొని విశాఖపట్నం వెళ్లడానికి ఇద్దరు కలసి వెలగాడ వసాది బస్టాప్ వద్ద నిలబడి ఉన్నారు. ఇంతలో బస్సు వస్తుండడంతో ఎక్కుదామని వెళ్తుండగా అదే బస్సు ఢీకొని మృతి చెందాడు. ఎస్ఐ సాయికృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకు బోల్తా.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలోని బాడంగి రోడ్డు గ్యాస్ ఆఫీసు దగ్గర ఆదివారం బైకు బోల్తాపడి ఇద్దరు వ్యక్తులకు గాయాలైనట్లు ఎఎస్‌ఐ అప్పారావు తెలిపారు. బాడంగి మండలం పూడివలస గ్రామానికి చెందిన బోను గౌరమ్మ, మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన అన్నంనాయుడు బైకుపై బాడంగివైపు వెళ్తుతుండగా రోడ్డు గతుకుల్లో బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోను గౌరమ్మ తలపై తీవ్ర గాయాలు కాగా, అన్నంనాయుడు స్వల్పంగా గాయపడ్డాడు. వీరిద్దరినీ బాడంగి సిహెచ్‌సికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.